

వచ్చే నెలా భారమే...

- కొనసాగనున్న విద్యుత్ భారాలు - సామాన్యులకు తీవ్ర భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వివిధ పేర్లతో మోపిన విద్యుత్ భారం వచ్చే నెల కూడా కొనసాగనుంది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలు వేయడంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది...

వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈ నెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. ఆ భారం వచ్చే నెల విద్యుత్ బిల్లుల్లోనూ కొనసాగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1), 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు కొన్ని పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న



వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసల చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గత ఏడాది ఆగస్టు నుంచే తొలి విడత ట్రూ అప్ చార్జీలను వసూలు చేస్తుండగా జులై నెల నుంచి రెండో విడత ట్రూ అప్ చార్జీలను వసూలు చేస్తుండడంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేశారు. ఇది విద్యుత్ వినియోగదారునికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క జూన్ నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. ఈ భారాలు వచ్చే నెల వచ్చే విద్యుత్ బిల్లుల్లోనూ భారం కొనసాగనుంది. సామాన్యులపై తీవ్ర భారం పడనుంది.

ఈకేవైసీని పూర్తి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సంక్షేమ పథకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మున్సిపల్ కమిషనర్లను, ఎంపిడిఒలను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ చేదోడు, అమ్మఒడి వంటి పథకాలకు సంబంధించి ఈకేవైసీ ఎక్కువగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. వాటిని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే 'వైఎస్ఆర్ చేదోడు'కు సంబంధించి హోళగుంద, 'జగనన్న అమ్మ ఒడి'కి సంబంధించి కర్నూలు అర్బన్‌లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత ఎంపిడిఒలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కన్సిస్టెంట్ రిథమ్స్‌లో భాగంగా పాఠశాలలను, వసతి గృహాలను, అంగన్వాడీ కేంద్రాలను సంబంధింత వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తనిఖీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలకు సూచించారు. సచివాలయాల ద్వారా నూతనంగా పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే వెరిఫై చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి చివరి దశలో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు సంబంధించి రోజువారీ లక్ష్యాన్ని కచ్చితంగా సాధించాలని పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. సిమెంట్, ఇసుక కొరత ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి తరానికి స్ఫూర్తి

- ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు

టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలను నేటితరం స్ఫూర్తిగా తీసుకొని వారు చూపిన మార్గంలో నడవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ సృజన పూలమాల వేసి నివాళులర్పించారు. డిఆర్ఒ నాగేశ్వర రావు, బీసీ సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

డిసిసి కార్యాలయంలో : జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు, ఇతర కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు

- సిపిఎం ప్రతినిధి బృందానికి కలెక్టర్ సృజన హామీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి .సృజన తెలిపారు. ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఈనెల 2 నుంచి 7 వరకు ఆదోని నుండి కర్నూలు వరకు చేపట్టిన మహా పాదయాత్రలో భాగంగా సిపిఎం ప్రతినిధి బృందానికి అనేక సమస్యలను ప్రజలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిపిఎం ప్రతినిధి బృందంతో బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్ ఉన్నారు. జిల్లా కలెక్టర్‌తో దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. వాటిలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులు, నగర డోన రిజర్వాయర్ నిర్మాణం పనులు మధ్యలో ఆగిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు ఇప్పటికి చాలా గ్రామాలకు రోడ్డు మార్గాలు లేని గ్రామాలకు వెంటనే రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్మశానవాటికలకు భూమి కేటాయించాలన్నారు. మండల కేంద్రాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆసుపత్రులుగా అభివృద్ధి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కువగా వలసలు ఉన్నందున 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇచ్చేలాగా కృషి చేయాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని, ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్బును అభివృద్ధి చేయాలన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మందుల కొరత ఉందని, టెస్టుల పరికరాలు పనిచేయడం లేదు. వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సంవత్సరం వర్షాభావం తక్కువగా ఉన్నందువల్ల వలసలు ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని, వాటిని అరికట్టాలన్నారు. తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా గ్రామాలకు పట్టణాలకు తాగునీరు అందించాలన్నారు. స్థానికంగా ఉండే గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కలెక్టరుకు విన్నవించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పూర్తయ్యేలాగా కృషి చేస్తానని, జిల్లాలో మా పరిధిలో ఉండే సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖలకు తెలియజేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

25 నుంచి ఎస్ఐ అభ్యర్థులకు

దేహదారుఢ్య పరీక్షలు

- ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 25 నుండి దేహదారుఢ్య (గ్రామీ, ్రాజు) పరీక్షలు జరగనున్నాయని డిఐజి ఎస్.సెంట్రల్ కుమార్ ఎస్‌పి జి.కృష్ణకాంత్ బుధవారం తెలిపారు.కర్నూలు ఎస్‌ఎపి క్యాంపు 2వ బెటాలియన్‌లో డిఐజి , ఎస్‌పి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా టైమింగ్ టెక్నాలజీ వారితో సాంకేతికంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. సిసికెమెరాల పనితీరు, సెన్సార్లు, అత్యవసర పరిస్థితులలో ఏదైనా జరిగితే అంబులెన్స్, డాక్టర్స్ వైద్య సదుపాయాలు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎత్తు, బరువు, చాతీ కొలతల పరికరాలను పరిశీలించారు. డిఎస్‌పి స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. పోలీసు నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 25 నుంచి సెప్టంబర్ 20 వతేది వరకు ఈ వెంట్స్ జరుగుతాయన్నారు. సమస్యలపై అప్పీల్ చేసుకునే వారు రిక్విజేసేన్ రాసి ఇచ్చి చివరి తేది సెప్టెంబర్ 21న రావాలని తెలిపారు. కర్నూలు రేంజ్ డిఐజి మాట్లాడుతూ ...ఎస్ఐ ఈవెంట్స్‌కు రాయలసీమ రేంజ్‌లో 16,108 మంది అభ్యర్థులు పాల్గొననున్నారని అన్నారు. 14,011 మంది పురుషులు, 2,097 మంది మహిళ అభ్యర్దులు పాల్గొంటున్నారన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారని, దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎస్ఐ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. అభ్యర్థులు ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్క్స్ లిస్టు, డిగ్రీ ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ సెర్టిఫికేట్స్, కుల ధృవీకరణ పత్రం, కమ్యూనిటి సెర్టిఫికెట్స్, క్రిమి లేయర్ సెర్టిఫికేట్ తీసుకోని రావాలన్నారు. స్టడీ సర్టిఫికేట్ 4 వ తగతి నుండి 10 వతరగతి వరకు ఒరిజినల్ ఎన్‌సిసి,ఆర్మీ ,నేవీ ఎయిర్ ఫోర్స్ సెర్టిఫికెట్లు, ఎన్‌సిసి ఎబిసి సెర్టిఫికేట్లు. సర్వీస్ సర్టిఫికెట్లు ఒరిజినల్ ట్రైబల్ సర్టిఫికేట్ లు, ఏజెన్సీ ఏరియా సర్టిఫికేట్, పోలీసు ఎగ్జిక్యూటివ్ , చిల్డ్రన్ ఆఫ్ పోలీసు పర్సనల్, పోలీసు మినిస్ట్రీయల్, ఎక్స్ సర్వీస్ మెన్, మెరిటోరియస్ స్పోర్ట్స్, స్కోరు కార్డ్ (ఒరిజినల్ రిజల్ట్) , స్టేజ్-1 అప్లికేషన్, స్టేజ్-క్ష్మీక్ష్మీ అప్లికేషన్ వెంట తెచ్చుకోవాలన్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన అన్ని ఈవెంట్స్ పై పరీక్ష ఉంటుందని క్వాలిపై కాకపోతే అర్హత కోల్పోతారని తెలిపారు. ఈవెంట్స్ పరీక్ష క్వాలిపై తరువాత మెయిన్స్ పరీక్షకు అర్హత సాధిస్తారన్నారు. పరీక్షలకు సంబంధించి పోలీస్ శాఖలోని అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి, ఎస్‌పి



నాగలాపురం , పెంచికల పాడు చెరువుకట్ట మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఫలించిన పోరాటం : సిపిఎం

చెరువు కట్ట మరమ్మతుకు శ్రీకారం -దీక్షలు విరమణ

ప్రజాశక్తి-గూడూరు

నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువును కొంతమంది అక్రమంగా చెరువు కట్టని తెంపి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తుండగా నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల ప్రజలు సిపిఎంతో కలిసి చేపట్టిన దీక్షలు విజయవంతమయ్యాయని సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్ తెలిపారు. బుధవారం చెరువు కట్ట మరమ్మతులు కూడా ప్రారంభించారని చెప్పారు. చెరువు కట్టను తెంపి కొంతమంది చెరువును ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకున్న సిపిఎం నాగాలాపురం, పెంచికలపాడు గ్రామ ప్రజల దృష్టికి తీసుకువెళ్లి వారిని ఐక్యం చేసి దీక్షలు చేపట్టిందన్నారు. దీక్షలో నాగలాపురం సర్పంచి సురేష్, పెంచికలపాడు సర్పంచి భాస్కర్ రెడ్డి , రెండు గ్రామాల ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు ,ప్రజలు సిపిఎంలో కలిసి దీక్షలను ప్రారంభించారు. దీక్షలకు టిడిపి, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, ఇతర గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, గూడూరు కౌన్సిలర్లు, మద్దతు తెలిపారు. ఉన్నతాధికారులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి నాయత్వంలో విన్నవించారు. చెరువు కట్ట ను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు సంయుక్తంగా బుధవారం చెరువు కట్ట మరమ్మతును ప్రారంభించారు. చెరువు కట్ట తెంపిన వారిపై కేసులు పెడుతామని, చెరువు కట్టను పునరుద్ధరిస్తామని ఒప్పుకోవడంతో దీక్షలు విరమించారు. ఇది నాగలాపురం, పెంచికల్పాడు, గ్రామ ప్రజలు, సిపిఎం కలిసి సాధించుకున్న విజయమన్నారు.

భవన నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలో నత్తనడకన సాగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి శ్యామల ఆదేశించారు. బుధవారం భవనాల స్థితిగతులను ఇంచార్జి ఎంపిడిఒ సందీప్, ఇంజినీర్లు మహేశ్వర్ రెడ్డి, గంగారాజుల సమక్షంలో పరిశీలించి గుత్తేదారులతో చర్చించారు. ఈ నెల లోపు పూర్తి చేస్తే బిల్లులు అందేలా చూడాల్సిందిగా సూచించారు.



పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యామల

ప్రజా సమస్యలు పట్టని పాలకులు : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పాతబస్తీ ప్రాంతంలోని 9,10 వార్డులలోని సమస్యలపై సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర సందర్భంగా ఆయా వార్డులలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్, నగరకమిటి సభ్యురాలు జయమ్మ తెలిపారు. 9,10 వార్డులలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పరదేశి హోటల్ నుండి మండి బజార్ పెరుగుసందు వరకు రోడ్డును తవ్వేసి తిరిగి పునర్ నిర్మించకుండా వదిలేశారు. 25 రోజుల నుంచి ప్రజల రాకపోకల కు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని, నిత్యం రద్దీగా ఉండే మండిబజారు, పెరుగువీధి ప్రాంతం ద్విచక్ర వాహనదారులకు కొరకరాని కొయ్యగా మారిందన్నారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. తొమ్మిదో వార్డు ఖలీల్ వాడీలో కూడా రోడ్లను తవ్వేసి వదిలేశారని తెలిపారు. ఆ ప్రాంతంలోని మురుగు కాలువలు సిల్టు తీసి వదిలేశారని ప్రజలు సిపిఎం బృందానికి తెలిపారు. కార్పొరేషన్ అధికారులు చెత్త పన్ను ముక్కు పిండి వసూలు చేస్తున్నారే తప్ప మురికి కాలువలు శుభ్రపరచడంలో, తీసిన సిల్టు తొలగించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు వార్డు కార్పొరేటర్ల చేతగాని తనానికి నిదర్శనమని విమర్శించారు. మండి బజార్ రాఘవేంద్ర ఫ్లోర్ మిల్ దగ్గర రెండు రోజుల నుంచి చెత్త తొలగించడం లేదని దానివల్ల దుర్గంభరితమైన వాసనను భరించలేక పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొందని కార్పొరేటర్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. 9,10 వార్డులలో అనేక ప్రాంతాలలో మంచినీటి సరఫరా సరిగా లేదని, మహిళల సామూహిక మరుగుదొడ్లు శుభ్రపరచకుండా, స్కావెంజర్స్‌ను నియమించకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతుందన్నారు. మహిళలు నానా యాతనలు పడుతున్నారని కనుక స్కావెంజర్స్‌ను నియమించి నీటి సరఫరా ఏర్పాటు చేసి మహిళల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ కమిషనర్ అవసరం లేని చోట మురుగు కాలువలు బాగున్న వాటిని ధ్వంసం చేసి నిర్మాణం చేయిస్తున్నారన్నారు. 9 ,10 వార్డులలో ధ్వంసం చేసిన రోడ్లను పునర్నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చాకలి రవికుమార్, గోరే బాయ్, ముసాఅహమద్, వలి తదితరులు పాల్గొన్నారు.



పాతబస్తీలో పేరుకు పోయిన చెత్తను చూపుతున్న రాజశేఖర్ , తదితరులు

పేదలందరికీ నాణ్యమైన వైద్యం

దేవమాడలో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైసిపి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యం అందించాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు మండలం, దేవమాడ గ్రామంలో డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దేవమాడ గ్రామంలో ఉన్న స్కూల్లో ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచి వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించారు. స్వయంగా ఆయనే రోగులను పరీక్షించి వైద్య సేవలందించారు. డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ అనగానే గుర్తుకు వచ్చేది మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, నేటి సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది తండ్రిఅయితే బలోపేతం చేసి కార్పొరేట్ వైద్యాన్ని పేదల చెంతకు చేర్చి పునర్జన్మనిచ్చింది కుమారుడు వైఎస్‌జగన్ మాత్రమే అన్నారు. ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని నేడు గ్రామాల్లోకి తీసుకు వచ్చి 10032 విలేజి హెల్త్ క్లినిక్ , అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు.పేదలు ఆరోగ్యవంతంగా జీవించాలనే ఉద్దేశంతో తనవంతుగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. దేవమాడ గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. రోగులను పరీక్షించిన వైద్యులు మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారిని ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. గ్రామ పెద్దలు, వార్డుమెంబర్లు, మహిళలు పాల్గొన్నారు. గురువారం సాయంకాలం ఐదు గంటల నుంచి ఈ తాండ్రపాడులో ఉచిత వైద్య శిబిరం ఉంటుందని డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు.

వెంకట రాములమ్మ మృతికి సంతాపం : దేవమాడ గ్రామానికి చెందిన వెంకట రాములమ్మ అనారోగ్యంతో మరణించారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్..రాములమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాములమ్మ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆదిమూలపు సతీష్ వెంట వైసిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కంప్యూటర్ ద్వారా కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ ఎ.సతీష్





కలెక్టరేట్ ఎదుట జెవివి ఆధ్వర్యంలో చంద్రయాడ్ 3 సక్సెస్ సంబరాల దృశ్యం

శాస్త్ర సాంకేతిక రంగాన్ని ప్రోత్సహించాలి : జెవివి

చంద్రయాడ్-3 సక్సెస్ సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : శాస్త్ర సాంకేతిక రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ డిమాండ్ చేశారు.. బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చంద్రయాన్ 3 విజయవంతం కావడంపై సంబరాలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బిడి సుధీర్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ పాల్గొని మాట్లాడారు ఇస్రోశాస్త్రవేత్తలు రూపొందించిన చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్రోను గుర్తించి తగిన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశం ముందంజలో నిలవాలని వారు ఆకాంక్షించారు. యూటిఎస్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, ప్రభుత్వ బిఇడి కళాశాల లెక్చరర్ వనం రాజు, ప్రజాశక్తి మేనేజర్ నరసింహ,ఆడిటర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామాగ్రి వితరణ

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్ : జిల్లాలోని కర్నూలు, కల్లూరు, చిప్పగిరి మండలాలకు చెందిన మిలిటరీ కాలనీ, పసుపల, శరీన్‌నగర్, కల్లూరు, అర్దవీడు, చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామాలకు చెందిన ఏడు ప్రభుత్వ పాఠశాలలకు రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య క్రీడా సామాగ్రి వితరణ చేశారు. బుధవారం అబ్బాస్ నగర్ లోని పాఠశాలలో ఆయన సామాజిక సేవలో భాగంగా తన వంతు సహాయంగా ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామాగ్రి వితరణ చేసినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులను ఆకట్టుకోవడంలో ఆట స్థలాలు ,క్రీడా సామాగ్రి ఉపయోగపడతాయని, ఆ దిశగా వారికి అందుబాటులో క్రీడా సామాగ్రిని, క్రీడా మైదానాలను ఉంచగలిగితే విద్యార్థులు ఆసక్తి కనబరిచి క్రీడల్లో పాల్గొనేందుకైనా పాఠశాలలకు ప్రతిరోజు హాజరవుతారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి శారీరక సౌష్టవంతో పాటు మేధస్సును పెంచుకునేలా సామాజిక సేవను అందించేందుకు రవీంద్ర విద్యాసంస్థలు ముందు ఉంటాయని తెలిపారు. ప్రతి పాఠశాలకు సుమారు రూ.7000 విలువచేసే క్రీడా సామాగ్రిని అందజేశారు. జిల్లాలో సుదూర ప్రాంతమైన చిప్పగిరి మండలం నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. రవీంద్ర విద్యా సంస్థల ఉపాధ్యాయ బృందం ప్రభాకర్, మద్దిలేటి, నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ముల్లా మహమ్మద్ బాష పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - దేవనకొండ



భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జయరామ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, శ్రీశైలం నియోజకవర్గ అబ్జర్వర్ సురేంద్ర రెడ్డి హాజరయ్యారు. ముందుగా రూ.80 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం-1, 2 భవనాలను ప్రారంభించారు. పొట్లపాడు గ్రామ రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో తెర్నేకల్ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.24 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తెల్లవంక వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 లక్షలు, గ్రామంలో తాగునీటి సమస్య నివారణకు రూ.15 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సచివాలయ అధికారులు 'సేవ' భావంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ గౌరీదేవి, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఎఇ సురేష్ బాబు, ఎంఇఒ తిమ్మారెడ్డి, మంత్రి గుమ్మనూరు సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మీదేవి, ఆమె భర్త లుమాంబ, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, సర్పంచి అరుణ్ కుమార్, పొట్లపాడు సర్పంచి సోమశేఖర్ రెడ్డి, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, వైసిపి నాయకులు దివాకర్ నాయుడు, మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హంపి రెడ్డి, నారాయణరెడ్డి, రాఘవేంద్ర, చాప వీరన్న, రామచంద్ర, పులి నరేష్, నాగన్న, ఏసేపు పాల్గొన్నారు.

చంద్ర బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి



మహిళలతో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని కైరుప్పల గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 2024 ఎన్నికల్లో సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపి చంద్రబాబు నాయుడును గెలిపించుకుందామని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్ పరమారెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, ఎంపిటిసిలు నరసన్న, రహీంతుల్లా, టిడిపి నాయకులు వరప్రసాద్, రవి రెడ్డి, శేషి రెడ్డి, హనుమంతు రెడ్డి, మల్లికార్జున, గోవిందు, సుదర్శన్, బసవరాజు, మునిస్వామి, రాఘవేంద్ర, ఆచారి పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదల అభివృద్ధి

- వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



అధికారులతో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే పేదల అభివృద్ధి సాధ్యమని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను ఆశీర్వదించాలని వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులై ఉండి పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. గ్రామంలో తాగునీటి, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ప్రదీప్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించి ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సొసైటీ అధ్యక్షులు రవీంద్ర, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, నాయకులు గజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, పూజారి ఈరన్న, జాము మూకయ్య, చంద్రశేఖర్, ముక్కరన్న, అర్లప్ప, తెలుగు చిన్న వీరేష్, కడబూరప్ప, యోహాను, లక్ష్మన్న, షాదిక్ బాష, ఎఇలు మల్లయ్య, వేణు గోపాల్, సాయికుమార్, ఎపిఒ రామన్న పాల్గొన్నారు.

ఖరీఫ్‌పై నీలి నీడలు...

- వర్షాల కోసం రైతులు ఎదురుచూపులు
- ఎండలకు ఎండుతున్న పత్తి, మిరప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఖరీఫ్ సీజన్‌పైనే మెట్ట రైతులు ఎక్కువగా ఆశలు పెట్టుకుంటారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో జూన్ నుంచే విత్తనాలు వేస్తుంటారు. ఈ ఏడాది ఆగస్టు వచ్చినా, సరైన వర్షం లేక విత్తనాలు వేయలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికే అదును దాటుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా దుక్కి దున్ని విత్తనాలు నాటకుండా వదిలేసిన భూములే దర్శనమిస్తున్నాయి.

ఈఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు అనుకూలంగా లేదు. జూన్‌లో తీవ్రమైన ఎండలతో పనులు ముందుకు సాగలేదు. జులై రెండో వారం నుంచి వర్షాలు మొదలయ్యాయి. ఆగస్టు నెల ప్రారంభం నుంచి తిరిగి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో బోర్ల కింద తప్ప మిగిలిన చోట పనులు నిలిచిపోయాయి. జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువ. అందులోనూ ఇప్పటివరకు కేవలం 20 శాతం పొలాల్లో మాత్రమే పంటలు వేశారు. వీటిలో బోర్ల కింద, అక్కడక్కడ చెరువుల కింద వేసిన నాట్లు నీరు లేక ఎండిపోతున్నాయి.

జిల్లాలో ఆదోని, ఆలూరు, హొళగుంద, కోసిగి, చిప్పగిరి, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ మండలాల్లో తక్కువగా వర్షపాతం నమోదు కావడంతో ఇంకా 80 శాతానికి పైగా ఖరీఫ్‌లో పంటలు వేయాల్సి ఉంది. ఇప్పటికే 20 శాతంలో సాగు చేసిన పొలాల్లో సరైన వర్షాలు లేక పత్తి, మిరప వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. సాధారణంగా ఆగస్టు ప్రారంభం నాటికి 60 నుంచి 70 శాతం మేర నాట్లు పూర్తి కావాలి. రెండో వారంలోకి ప్రవేశించినా అన్ని రకాల పంటలు కలిపి 20 శాతం పొలాల్లో సాగు చేశారు. ఆదోనిలో వరి 10 నుంచి 15 శాతం మాత్రమే ఉంది. ప్రస్తుతం బోర్ల కింద నాట్లు వేస్తున్నారు. వర్షాధారంపై ఆధారపడిన భూముల్లో నాట్లు వేయడానికి రైతులు ఎదురుచూస్తున్నారు. మరో వారం, పది రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికే నాటిన మిరప, పత్తి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా వర్షంపై ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తుంటారు రైతులు. వచ్చే నెల రెండో వారం వరకూ చూసి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



వర్షాలేక ఎండిపోతున్న మిరప పంట

ఆశాజనకంగా లేదు

- ఎ.అశోక్ కుమార్ రెడ్డి

జిల్లాలో ఖరీఫ్ సాగు ఈఏడాది ఆశాజనకంగా లేదు. సాధారణంగా జూన్, జులై నెల్లో మెట్ట పంటలు సాగు చేస్తారు. వర్షాలేక సమస్య నెలకొంది. వర్షాలు పడితే ఆగస్టు చివర వరకు కంది, పత్తి, మిర్చి వంటివి సాగయ్యే అవకాశం ఉంది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగానే ఉన్నాయి. కావాల్సిన వారు ఆర్‌బికెలను సంప్రదించవచ్చు.



పనులను పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

కారు పార్కింగ్ పనులు వేగవంతం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో జరుగనున్న ఆరాధన మహోత్సవాలకు వచ్చే భక్తుల కారు పార్కింగ్ కోసం పనులను వేగవంతం చేయాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం స్థానిక హెలిప్యాడ్ గ్రౌండ్‌లో జెసిబి సహాయంతో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 4 వరకు రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ముళ్ల కంపలతో, నీటితడితో ఉన్న హెలిప్యాడ్ గ్రౌండ్‌ను శుభ్రం చేసి వాహనాలు నిలిపేందుకు అనువుగా మార్చాలని సూచించారు. నిర్లక్ష్యం విడిచి వేగంగా పనులు పూర్తి చేయాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్ గిరి ఉన్నారు.

బటన్ నొక్కి వర్షం కురిపించు జగన్

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటే వర్షాలు రావని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని, ఒక్కసారి బటన్ నొక్కి వర్షాన్ని తెప్పించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని హాలహర్వి, మాచాపురం, గురజాల, నందవరం గ్రామాల్లో పర్యటించారు. హాలహర్వి గ్రామ సమీపంలోని దేశాయ్ చెరువును పరిశీలించి, వైసిపి తీరుపై, వైసిపి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమది రైతు ప్రభుత్వమని వైసిపి నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైసిపి రైతు దగా ప్రభుత్వమని మండిపడ్డారు. చెరువులో నీరు లేకపోవడం వల్ల సుమారు 600 ఎకరాలు బీళ్లుగా మారాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు చెరువును నింపి రైతులకు నీరివ్వాలని చెప్పారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, చిలకలడోన ఎత్తిపోతల పథకం అధికారులు ఎత్తిపోతల పథకం కడగొమ్ము (అడ్డు గోడ) సుమారు 1 అడుగు ఎత్తు పడగొట్టడం దారుణమని విమర్శించారు. కడగొమ్ము పడగొట్టడాన్ని నిరసిస్తూ న్యాయపోరాటం చేస్తామన్నారు. గురజాల గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కురువ బీరప్ప కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, టిడిపి తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చి, రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. గురజాల, రాయచోటి గ్రామాల మధ్య తుంగభద్ర నదిని పరిశీలించారు. టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్, నాగరాజ్ గౌడ్, ఖాసీం వలి, రైస్ మిల్ నారాయణ రెడ్డి, గజేంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, శంకరమ్మ, దావీదు, వీరేష్, బడేసాబ్, గణేష్, ఈసా పాల్గొన్నారు.



కడగొమ్మును పరిశీలిస్తున్న బీవీ

ప్రాధాన్యత భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ భవన నిర్మాణాలు, ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న కాలనీలోని హౌసింగ్ నిర్మాణాలు త్వరగా వంద శాతం పూర్తి కావాలని ఎస్‌ఎస్‌ఎ ఎపిసి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వేణుగోపాల్ మండల అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ సివి.కొండయ్య ఆధ్వర్యంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం చిప్పగిరి జగనన్న కాలనీలోని హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీలోని ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని థర్డ్ పార్టీ కాంట్రాక్టు దారులను ఆదేశించారు. మెటీరియల్స్, హౌసింగ్ బిల్లులను ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. మండలంలో సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను చివరి దశకు వచ్చాయని తెలిపారు. సెప్టెంబర్ ఆఖరి నాటికి వంద శాతం పూర్తి కావాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులపై సంబంధిత ఎంఇఒలు సావిత్రమ్మ, బాల నాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో 'చంద్రయాన్-3'పై నిర్వహించిన కార్యక్రమాన్ని బాలికలతో కలిసి తిలకించారు. ఇఒఆర్‌డి సంజన, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ నీలా, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, హౌసింగ్ అధికారి భవ్య, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వేణుగోపాల్, ఎంపిడిఒ కొండయ్య

చేనేతలకు రుణాలిచ్చి ఆదుకోవాలి

- వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేతలకు రుణాలిచ్చి ప్రభుత్వ ఆదుకోవాలని వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు సి.గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో చేనేత కార్మిక సంఘం సమావేశం లక్ష్మన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు, చేనేత సంఘం కార్యదర్శి కాలప్ప, ఉపాధ్యక్షులు కృష్ణ మాట్లాడారు. ఎమ్మిగనూరులో కేవలం 1000 మందికే చేనేత ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చారని తెలిపారు. అర్హులైన చేనేతలకు ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మార్కెటింగ్ హ్యాండ్లూమ్ పేరుతో కేవలం 1500 మందికి మాత్రమే పింఛనుకార్డులను మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మిగనూరులో నేతన్న నేస్తం కింద కేవలం 1800 మందికి మాత్రమే లబ్ధి చేకూరిందని చెప్పారు. రాబోవు కాలంలో చేనేతల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. చేనేత సంఘం నాయకులు మాది గుండు రాజు, ఎల్లప్ప, గోవిందు, గంగన్న, బుగిడే పంపయ్య పాల్గొన్నారు.

విఒఎలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని వైకెపి కార్యాలయంలో విఒఎలకు నిధుల ప్రణాళిక, నిధుల నిర్వహణ అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌ఛార్జీ ఎపిఎం ముకన్న, ఎలొసి మధు మాట్లాడారు. ఫైనాన్షియల్ పాలసీ, ఆర్థిక నిర్వహణ, అకౌంటింగ్ విధానం, అంతర్గత నియంత్రణ, ఆడిట్, గ్రామ, మండల సమాఖ్య అందించే ఆర్థిక సేవలు విధానం, విఒఎంఎస్ అందించే సేవలు, పొదుపు విధానం, బీమా, ఇతర విషయాలపై వివరించారు. సిసిలు లలిత, రాణి, శకుంతల, వీరకృష్ణుడు, ఎంగన్న, అకౌంటెంట్ రంగశ్రీ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- అర్బన్ మెప్మా మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

వ్యాపారాలు నిర్వహించుకునేందుకు పొదుపు మహిళలకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలోని టూ టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ షమీనా, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి అధ్యక్షతన అర్బన్ మెప్మా మార్కెట్‌ను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదోని అర్బన్‌లో సుమారు 3 వేల పొదుపు గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ప్రతేడాది బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను రూ.20 కోట్లు మంజూరయ్యేలా లక్ష్యం పెట్టుకున్నారని చెప్పారు. ప్రతి పొదుపు మహిళకూ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాటలు వేస్తున్నారని తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల వద్ద వ్యాపారాలు చేసుకునే వారికి మరింత లాభం సమకూర్చేలా చర్యలు తీసుకుంటూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామన్నారు. వారు తయారు చేసిన వంటకాలు, రసాయనాలు, బట్టలు, తినుబండారాలు, ఆహార పదార్థాలను బజార్లలో విక్రయించుకునేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆదోనిలో ప్రత్యేకంగా మెప్మా బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నాయని, వారి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్, రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మెప్మా సిఒలు అరుణ, కృష్ణవేణి, ఇద్రూస్, నాయకులు దేవా, మహబూబ్ బాషా, నరసింహ మూర్తి ఉన్నారు.



అర్బన్ మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హుండీ ఆదాయం లెక్కింపు పూర్తి

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శ్రీమఠం చేరుకున్న భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని మంగళవారం నుంచి లెక్కించినట్లు తెలిపారు. శ్రీమఠం అధికారులు, దేవదాయ శాఖ అధికారులు, సేవాదారుల సమక్షంలో 22 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు. రూ.2,40,63,919 నగదు, బంగారం 65 గ్రాములు, వెండి 85 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఒ

ఆలూరు : ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. బుధవారం ఆలూరు సచివాలయం-1లో ఆధార్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. ఆధార్ కార్డులో ఇంటి నెంబర్, పేర్లు, ఇంటి అడ్రస్ తప్పులుంటే సరిచేసుకోవడానికి ఈనెల 25 వరకు ఆలూరు సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

ఆదోని : ఆదోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదోని శ్రీనివాస కల్యాణ మండపంలో 33 మంది టిబి రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ... ప్రతి టిబి రోగికీ ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఉషా రావు, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ హరీష్, ఆదోని టిబి ఆఫీసర్ డాక్టర్ షేకున్ భాను, ఏడిమ్ హెచ్‌ఒ డాక్టర్ రఘురామి రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, రీజియన్ ఛైర్మన్ ప్రసాదరావు, కోశాధికారి శంకరమ్మ, ఈసీ మెంబర్లు కెజి.మూర్తి, మల్లికార్జున గౌడ్, టిబి డిపార్ట్‌మెంట్ బాబు రాజు, సూపర్‌వైజర్లు ఉమాపతి, కోఆర్డినేటర్ వీరేష్, స్వరూప్, మనోరంజని, సుబ్బమ్మబాయి, లలిత బాయి, కల్యాణ మండపం మేనేజర్ ఈరన్న పాల్గొన్నారు.

రైతులకు వడ్డీల భారం...

- దళారులకు లాభాల కాలం..!
- వారం రోజులకే నెల వడ్డీ వసూలు
- దళారులదే బ్యాంకులో ఆధిపత్యం
- కొంతమంది బ్యాంకు అధికారులు, దళారులు కుమ్మక్కు
- లాకర్ రూముల్లోకి ప్రయివేట్ వ్యక్తులు..?
- రైతుల నడ్డి విరుస్తున్న వడ్డీల వ్యాపారం

ప్రజాశక్తి - నందవరం

బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలందించి రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. రైతు సంక్షేమం మాత్రం పట్టడం లేదు. ప్రభుత్వాల బాటలోనే బ్యాంకర్లు కూడా రైతు రుణాలు అందిస్తున్నామని పైపైన చెబుతున్నా రుణాలిచ్చే సందర్భంలో ఎన్నో నిబంధనలు పెట్టి దళారులకు లబ్ధి చేకూరుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు పొందడం, రుణాలు రెన్యువల్ చేయించుకోవడానికి బ్యాంకులకు వెళితే దళారులకు వడ్డీల రూపంలో వారానికి రూ.5 వేల నుంచి రూ.10 వేలు సమర్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నందవరం మండలం కెనరా బ్యాంకులో ఖరీఫ్ వచ్చిందంటే దళారులకు పండగే. ఆ దళారులను కూడా బ్యాంకు అధికారులు ప్రోత్సహిస్తూ తమ డబ్బులను కూడా రైతులకు వడ్డీ రూపంలో అందిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. నందవరం కెనరా బ్యాంకు పరిధిలో నందవరం, పూలచింత, మాచాపురం, గంగవరం గ్రామాలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చి అక్కడక్కడ వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంట పెట్టుబడి కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే కొంత మంది రైతులు రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. చేసేదేమీ లేక రెన్యువల్ కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా భావించి దళారులు కొంతమంది బ్యాంకు అధికారులతో కుమ్మక్కై రైతుకు ఎంత కావాలో అంత మొత్తాన్ని అందించి వడ్డీ రూపంలో నూటికి రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. కేవలం వారం రోజుల్లో బ్యాంకు నుంచి రుణాలు అందేటట్లు బ్యాంకు అధికారులతో కుమ్మక్కై, వేల రూపాయలను వడ్డీ రూపంలో తీసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే బ్యాంకుల్లోని ప్రయివేట్ వ్యక్తులు లాకర్ రూములోకి దర్జాగా వెళ్తున్నారంటే బ్యాంకు అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. జిల్లా బ్యాంకు అధికారులు స్పందించి బ్యాంకులోని సిసి కెమెరాలను పరిశీలిస్తే దళారుల బాగోతం బయట పడే అవకాశం ఉంది. రైతులను ఆదుకోవాల్సిన బ్యాంకు అధికారులు దళారులకు వత్తాసు పలుకుతూ రైతులకు వడ్డీల రూపంలో నష్టం తెస్తున్నారు. జిల్లా అధికారులు, అవినీతి శాఖాధికారులు స్పందిస్తే బాగుంటుందని రైతులు, ప్రజలు కోరుతున్నారు.





ఐక్యతను తెలుపుతున్న కురువ సంఘం నాయకులు

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతాం

- కురువలకు కర్నూలు ఎంపీ, రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

- కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వచ్చే ఎన్నికల్లో కర్నూలు జిల్లాకు రెండు ఎమ్మెల్యే టిక్కెట్లు, ఒక ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని, సతా చాటుతామని కురువ సంఘం నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని గురు నవోదయ కోచింగ్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి డి.రఘురాం, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు బీరప్ప, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోఆర్డినేటర్ జోసి రాఘవేంద్ర మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కురువలకు కర్నూలు జిల్లాలో ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరారు. లేకపోతే అన్ని రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సర్పంచి, ఎంపిటిసి, జడ్‌పి స్థాయిలోనే వారికి పదవి ఇస్తున్నారని, చట్టసభల్లో పంపించడానికి ఏ రాజకీయ పార్టీ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలను, వారి అధినేతలను కలవడానికి 2024 ఎన్నికల కమిటీ ప్రకటించారు. లింగమూర్తి, ఈశ్వరయ్య, గడ్డం రామకృష్ణ, దేవేంద్రప్ప, విఠల్ గౌడ్, కెవి.చలపతి రెడ్డి, కుమార్, నాగేశ్వరరావు, మద్దిలేటి, రఘురాం, యువజన విభాగం నుంచి వశీకరి రమేష్, రామకృష్ణ, శ్రీనివాసులు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో అక్టోబర్ 23న జరిగే 'షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్'ను జయప్రదం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 100 వాహనాల్లో బయల్దేరనున్నట్లు తెలిపారు. కురువ సంఘం నాయకులు నరసింహ, గోపాల్, బనవాసి నరసింహ, గంగులపాడు బీరప్ప, ఎర్రకోట యాదగిరి, కె.పుల్లన్న, ట్రెజరర్ యాదగిరి పాల్గొన్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం...

- విద్యుత్ అంతరాయంపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కోసిగి

ఓవైపు వరుణుడు కరుణించడం లేదని, మరోవైపు విద్యుత్ కోతలు వేధిస్తున్నాయని రైతులు వాపోయారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విద్యుత్‌ను సక్రమంగా అందించాలని మండలంలోని దొడ్డిబెళగల్ విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడారు. దొడ్డి బెళగల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో దొడ్డి బెళగల్, చిన్నబొంపల్లి, చింతకుంట, పల్లెపాడు తదితర గ్రామాల రైతులు బోరుబావుల కింద వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఉల్లి, మిరప, పత్తి, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కనీసం బోరుబావుల కింద సాగు చేయాలని రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశారని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 నుంచి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ అధికారి వీరేష్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం నాయకులు తాయన్న, బాల, హనుమంతు, మహానంది, గడ్డం హనుమంతు, రైతులు తలారి వెంకటేష్, రాఘవేంద్ర, శేషు, వరి నర్సప్ప, కుమ్మరి వీరేష్, దేవన్న పాల్గొన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

చంద్రయాన్-3 గర్వకారణం

ప్రజాశక్తి - ఆదోని

భారత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'చంద్రయాన్-3' దిగ్విజయం కావాలని బుధవారం పట్టణంలోని శ్రీచైతన్య-1, శ్రీచైతన్య-2 పాఠశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హరికృష్ణ, గౌసియా ఖానమ్ మాట్లాడారు. ముందుగా చంద్రయాన్-3 ప్రయోగానికి కృషి చేసిన భారత శాస్త్రవేత్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్రుడుపై కాలు మోపుతున్న చంద్రయాన్-3 కార్యక్రమాన్ని వీక్షించేందుకు కోట్లాదిమంది భారతీయులు ఎంతో ఆసక్తి, ఉత్కంఠతతో ఉన్నారని తెలిపారు. ప్రతేడాది ఎన్‌ఎస్‌ఎ ప్రాజెక్టులను విద్యార్థులతో చేయించి, ఎన్‌ఎస్-ఎస్ ప్రాజెక్టు వారికి పంపుతున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఎందరో విద్యావంతులు ఎన్‌ఎస్-ఎస్ ప్రాజెక్టుకు పంపిస్తున్నారని, అందులో శ్రీచైతన్య పాఠశాల నుంచి 75 శాతం ప్రాజెక్టులను ఎంపిక చేయబడతాయని చెప్పారు. ఎఒ అశోక్ కుమార్, అకాడమిక్ డీన్ వీరారెడ్డి, మహబూబ్ అలీ, విజయలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

'దేశ కీర్తిని చాటారు'

ప్రజాశక్తి - మంత్రాలయం

చంద్రయాన్-3 విజయవంతంతో మరోసారి భారత దేశ కీర్తి ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత శాస్త్రవేత్తలకు దక్కిందని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు కొనియాడారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు చంద్రుడిపై 'చంద్రయాన్-3' విజయవంతంగా చేరుకున్న నేపథ్యంలో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మేధావులకు, పండితులకు, శాస్త్రవేత్తలకు భారతావని పుట్టినిల్లు అని హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ఇస్రో ఛైర్మన్‌కు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.





వచ్చే నెలా భారమే..

- కొనసాగనున్న విద్యుత్ భారాలు
- సామాన్యులకు తీవ్ర భారం



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వివిధ పేర్లతో మోపిన విద్యుత్ భారం వచ్చే నెల కూడా కొనసాగనుంది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలు వేయడంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది...

వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈ నెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. ఆ భారం వచ్చే నెల విద్యుత్ బిల్లుల్లోనూ కొనసాగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1), 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు కొన్ని పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా జులై నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేశారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క జూన్ నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. ఈ భారాలు వచ్చే నెల వచ్చే విద్యుత్ బిల్లుల్లోనూ భారం కొనసాగనుంది. దీంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

- అక్రమ కేసులు ఎత్తివేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా రెండవ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రశ్నించే వారిని అణగ దొక్కుతుందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. నిజాలను నిర్భయంగా రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం పద్ధతి కాదన్నారు. మహానంది మండలంలో జర్నలిస్టు మధుపై వైసిపి నాయకులు దాడి చేసి అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. మహానంది మండలంలో భూకబ్జాలు ఎక్కువయ్యాయని జర్నలిస్టు మధు ఆర్టికల్ రాశారని, వైసిపి నాయకులు కక్ష పెట్టుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శిల్పా సమక్షంలోనే దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనని అన్నారు. తక్షణమే మహానంది మండల విలేకరి మధుపై అక్రమ కేసులు ఎత్తివేసి వేసి, దాడి చేసిన వైసిపి నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాల వెంకట్, శివ, లక్ష్మణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు సిఐటియు మద్దతు

ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా రెండవ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట ముద్దులు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు మాట్లాడారు. విలేకరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ఎపి దేశానికే ఆదర్శం

- గ్రీన్ ఎనర్జీలో రూ. 25,800 వేల కోట్ల పెట్టుబడులు
- రూ. 10 వేల కోట్ల విలువైన ప్లాంట్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌పిసితో ఒప్పందం
- మెగావాట్‌కు లక్ష చొప్పన ప్రభుత్వానికి వందేళ్ల పాటు రాయల్టీ ఆదాయం
- 3 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టుకు వర్చువల్ విధానంలో బటన్ నొక్కి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-అవుకు/బేతంచెర్ల

గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి రూ. 25,800 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ప్రకటించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా 4,300 మెగావాట్ల సామర్థ్యమున్న ఎంఎం గ్రీన్‌కో, ఆర్సిలర్ యుటెల్, ఎకోరెన్ గ్రీన్ ఎనర్జీ కంపెనీలకు చెందిన సోలార్, విండ్‌పవర్ ప్రాజెక్టులకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ వర్చువల్‌గా బుధవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులతో రాష్ట్రానికి గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 25,800 కోట్ల పెట్టుడులతో దాదాపు 6 వేలకు పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులతో భవిష్యత్తులో వందేళ్ల పాటు మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వివరించారు. తాజా ప్రాజెక్టులతో ఎపి గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 8 వేల ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు అవుతున్నట్లు సీఎం జగన్ పేర్కొన్నారు.

నంద్యాల జిల్లాలోని అవుకు, పాణ్యం, బేతంచెర్ల, డోన్ మండలాల్లో ఈ సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అవుకు మండలంలో జూనూతల, ఉప్పలపాడు, కొండమనాయునిపల్లి గ్రామాల్లో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 2,300 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామంలో ఏఎంగ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 700 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, 300 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు, బేతంచెర్ల మండలం ముద్దవరం, డోన్ మండల కేంద్రంలో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 1000 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, 1000 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయన్నారు. మరో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కోసం ఎన్‌హెచ్‌పీసీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు సిఎం జగన్ వివరించారు.

8 వేల ఎకరాల్లో దేశంలోనే పెద్ద సోలార్ పవర్ ప్లాంట్

తాజా పెట్టుబడులతో రాష్ట్రంలో 8 వేల ఎకరాల్లో దేశంలోనే పెద్ద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రీన్‌కో ఎనర్జీకి సంబంధించి సౌర విద్యుత్ ప్రాజెక్టు దాదాపుగా రూ. 10,350 కోట్ల పెట్టుబడితో 2300 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రాజెక్టు ఇదని, దీనితో ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందన్నారు. 16 వేల మిలియన్ యూనిట్లకు సంబంధించి సోలార్ ఎనర్జీ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రూ 2.49 పైసలతో ఎంఒయు చేసుకున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌హెచ్‌పిసితో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇది సహాయపడుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వంపై కానీ, థర్మల్ పవర్ స్టేషన్ పై కానీ భారం పడకుండా రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాని చెప్పారు. అంతేకాకుండా మరికొన్ని చోట్ల విద్యుత్ ప్లాంట్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. గ్రీని ఎనర్జీ ఉత్పత్తి చేసే విషయంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులే ఆధారం

పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల వల్ల భవిష్యత్తు తరాలకు గ్రీన్ ఎనర్జీ అందుతుందని సీఎం పేర్కొన్నారు. కాలుష్య కారక విద్యుత్‌పై ఆధారపడే పరిస్థితి క్రమేణా తగ్గుతుందని, భవిష్యత్తులో పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వీటికి అనుబంధంగా సోలార్, విండ్ ప్రాజెక్టులు అనుసంధానం అవుతున్న తీరు గ్రీన్ ఎనర్జీలో విప్లవానికి దారితీస్తాయని చెప్పారు. ఉదయం 6 నుంచి సాయంత్రం వరకూ సోలార్ వస్తుందని, సాయంత్రం నుంచి తెల్లవారుజామువరకు విండ్ ఎనర్జీని వాడుకోవచ్చన్నారు. పీక్ అవర్స్‌లో పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టులను వినియోగించుకుంటా మని సీఎం వెల్లడించారు. ఒక కృత్రిమ బ్యాటరీగా పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు పనిచేస్తాయని, కాలుష్య రహిత విద్యుత్ ఉత్పాదనలో ఎపి మొదటి స్థానంలో నిలిచేలా ఈ అడుగులు వేస్తున్నామని సిఎం పేర్కొన్నారు. ఎపిలో 8999 మెగావాట్లకు సంబంధించి సోలార్, విండ్ పవర్ ఉందని, రైతులకు ఉచితంగా పగటిపూటే విద్యుత్తు అందుబాటులోకి రావాలని, 7200 మెగావాట్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో రూ.2.49లకే ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు.

రూ. 10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుకు ఎన్‌హెచ్‌పిసితో ఒప్పందం

29 ప్రాజెక్టులకు సంబంధించి 33వేల మెగావాట్లకు పైగా ప్రాజెక్టు నివేదికలు, కొన్ని డిపిఆర్‌లు కూడా సిద్ధమయ్యాయని వివిధ కంపెనీలకు అలాట్‌మెంట్‌కూడా చేశామన్నారు. ఇందులో భాగంగానే ఎన్‌హెచ్‌పిసితో ఒప్పందం చేసుకుంటున్నామని, యాగంటిలో, కమలపాడులో దాదాపుగా 2వేల మెగావాట్లకు సంబంధించి రూ.10వేల కోట్లతో చెరిసగం వాటాతో ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంఒయు కుదుర్చుకుంటున్నాని, ఈరెండు సంస్థలూ మరింతగా అడుగులు ముందుకేసేందుకు మరో 3700 మెగావాట్లకు సంబంధించిన ఫీజబిలిటీ స్టడీలు జరుగుతున్నాయని తెలిపారు.

వందేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం

ప్రతి మెగావాట్ ఉత్పత్తికి ఈ ప్రాజెక్టుల నుంచి వందేళ్ల పాటు రాయల్టీ కింద రాష్ట్ర ప్రభుత్వానికి రూ. లక్ష చొప్పున ఆదాయంతో పాటు జీఎస్టీ ఆదాయం కూడా ప్రభుత్వానికి వస్తుందని సీఎం జగన్ తెలిపారు. ప్రాజెక్టులకు సహకారం అందిస్తున్న రైతులకు, రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తిగా ఉంటూ ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.30 వేలు లీజు పేరున ఆదాయం వస్తుందన్నారు. ప్రతి రెండేళ్లకు 5 శాతం లీజు రుసుం పెరుగుతుందని, ఈ ప్రాజెక్టుల వల్ల రైతులకు మంచి జరుగుతుందని తెలిపారు. దశాబ్దాలుగా నీళ్లకు కటకటలాడే ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టుల కారణంగా రైతులకు మంచి జరుగుతుడంతో పాటు యువతకు స్థానికంగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సిఎం పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ కో ప్రతినిధులు, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, డోన్ ఆర్‌డిఓ వెంకట్ రెడ్డి, డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, నాయకులు చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లారామేశ్వర్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, రైతులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎంపీ, ప్రజాప్రతినిధులు



38వ వార్డు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి

- స్పందన రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్
- సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సచివాలయ సిబ్బంది క్రమశిక్షణతో అప్పగించిన పనులను నిర్దేశిత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణం విద్యానగర్‌లోని 24వ వార్డు సచివాలయాన్ని, వైఎస్ఆర్ నగర్‌లోని 38వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3 గంటలైనా భోజనానికి వెళ్లిన సచివాలయ సిబ్బంది ఎవరు రాకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించినప్పటికీ సిబ్బంది ఆలస్యంగా రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ... మరోసారి పునరావృతం అయితే తీవ్ర కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనకు సంబంధించిన రిజిస్టర్‌లను కలెక్టర్ పరిశీలిస్తూ ఫిర్యాదులు నిర్ణీత కాల పరిమితిలోపు పరిష్కరించడంతోపాటు అప్పజెప్పిన రిజిస్టర్లన్నింట్లో నమోదు చేయాలన్నారు. బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) ను పర్యవేక్షిస్తూ పట్టణంలో పెండింగ్ ఉన్న 2500 మంది పిల్లల నమోదును వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిఇఓ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు. ప్రాథమిక విద్యలో బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) వంద శాతం పూర్తి కావాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. అలాగే బిఎల్వోల రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా సవరణకు ఇంటింటికి వెళ్లి విచారించి నమోదు చేయాలని ఆదేశించారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్.. జైలుకు తరలింపు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న తోట జితేంద్రపైన పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలించినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల చుట్టుప్రక్కల ప్రాంతాలలో అతని పైన 6 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. మార్పు రాకపోతే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి

- ప్రజానాట్య మండలి, ఎస్ఎఫ్ఐ నేతలు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంగ్రామ బైక్ యాత్ర ప్రారంభం



విద్యార్థి సంగ్రామ బైక్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కోయిలకొండ నాగరాజు

ప్రజాశక్తి - ప్యాపిలి

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయలకొండ నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామ బైక్ యాత్రను బుధవారం ప్యాపిలిలోని బాలుర హైస్కూల్ నందు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయలకొండ నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్కా కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్యాపిలిఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే విస్తరణలో, జనాభాలో అతిపెద్ద మండలమని, అటువంటి మండలంలో విద్యారంగం మాత్రం చాలా వెనకబడి ఉందన్నారు. ఉన్నత విద్యకోసం విద్యార్థులు సూదురప్రాంతాలైన గుత్తి, డోన్‌లకు వెళ్లిన చదువుకుంటున్నారని తెలిపారు. ప్యాపిలిలో జూనియర్ కాలేజీ మాత్రమే ఉందని, పిల్లలు ఆడుకోడానికి ఆట స్థలం లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పందించి ఆట స్థలంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటు చేయాలని కోరారు, ప్యాపిలిలో బాయ్స్ హాస్టల్ పూర్తిగా దెబ్బతిని కూలిపోయేలా ఉందని, నూతన భవనం నిర్మాణం చేపట్టాలని, హాస్టల్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు లేవన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్నా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా పంపిణి చేయాలని కోరారు. జిఒ 77ను రద్దు చేసి, పీజీ విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన కల్పించాలని, జూనియర్, డిగ్రీ కాలేజ్‌ల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి సంగ్రామ బైక్ యాత్ర ప్యాపిలిలో ప్రారంభమై డోన్, బేతంచెర్ల మీదుగా బనగానపల్లె చేరుకుంటుందన్నారు. ఈ సంగ్రామ బైక్ యాత్రలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇర్ఫాను బేగం, మహబూబ్ బాష, సురేష్, శ్రీనివాస్, గిడ్డయ్య, శివకాంత్, మహేంద్ర, మల్లికార్జున, మహి, మహీంద్రా, ధోని తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మొదటి రోజు బేతంచెర్లకు చేరుకుంది. పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ సర్కిల్ వరకు 300 మందితో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్క కుమార్, కార్యదర్శి నిరంజన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశార. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

కాసులిచ్చుకో... కోరిన ప్లేస్ పట్టుకో...

- అయిన వారికి దగ్గరగా.. కాని వారికి దూరంగా...
- నిబంధనలకు విరుద్ధంగా ఐసిడిఎస్‌లో బదిలీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్త్రీ శిశు సంక్షేమ శాఖలో చేపట్టిన బదిలీల ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టానుసారంగా బదిలీలు చేశారని అధికారులపై విమర్శలు వస్తున్నాయి. అధికారులకు అనుకూలంగా ఉన్న వారిని తమకు దగ్గర స్థానాల్లో, కానీ వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండు నెలల కిందట జరిగిన అంగన్వాడీ సూపర్‌వైజర్ల బదిలీల్లో కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్‌జెడి కార్యాలయంలో ఉన్న పర్యవేక్షకురాలు దగ్గరి స్థానాలకు రూ. 20 వేల నుండి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. కాసులు ఎవరైతే ఇచ్చారో వారికి కోరుకున్న స్థానాలు కేటాయించారు. కాసులు ఇవ్వని వారికి ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. నంద్యాల అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో ఏళ్ల తరబడి నుండి సూపర్ వైజర్‌గా పని చేస్తూ, 8 నెలల్లో విరమణ పొందాల్సిన ధరణిని కడప జిల్లా పొద్దుటూరు రూరల్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారు. ఆమె 8 నెలలు ఉంటే రిటైర్డ్ కావాల్సి ఉంది. ఏడాదిలోగా రిటైర్డ్ ఉంటే వారిని బదిలీ చేయడానికి అవకాశం లేదని నిబంధనలు ఉన్నా వాటిని పక్కన పెట్టి ఓ వ్యక్తి కోసం బలవంతంగా బదిలీ చేశారనే వాదన వినిపిస్తుంది. నంద్యాల రూరల్ సూపర్ వైజర్‌గా ఉంటూ మంత్రాలయంకు బదిలీ అయిన విజయ కోసం మొన్నటి వరకు పీడీగా పని చేసి సెలవుల్లో ఉన్న ఓ సిడిపిఓ చక్రం తిప్పి నంద్యాల అర్బన్‌లో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ధరణి ని అక్కడ నుండి బదిలీ చేయించి ఆ స్థానంలోకి తన అనుయాయురాలు విజయను తెచ్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రాలయంకు బదిలీ అయిన నలుగురు కూడా అక్కడికి వెళ్లకుండా ఆర్‌జెడి కార్యాలయంలో మేనేజ్ చేసి అందరూ నంద్యాల జిల్లాలోనే ఉండిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సూపర్ వైజర్ పోస్టుల భర్తీలో కూడా సంబంధిత శాఖా అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సూపర్ వైజర్‌ల బదిలీలలో, పోస్టుల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

నట్టేట ముంచిన 'నకిలీ మినుము'

- 400 ఎకరాల్లో నష్టపోయిన రైతులు
- మినుము పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల పరిధిలోని యర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన రైతులు నకిలీ మినుము విత్తనాలతో నట్టేట మునిగారు. గ్రామానికి చెందిన 60 మంది రైతులు గుంటూరు జిల్లా తెనాలిలో ఓ వ్యాపారస్తుడి వద్ద పియు-31 రకం మినుము విత్తనాలను కొనుగోలు చేశారు.లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సుమారు 400 ఎకరాలలో పంటను సాగు చేశారు. పంట సాగు చేసి 70 రోజులయినా పూత, పిందె రాకపోవడంతో దిక్కుతోచని రైతులు అయోమయంలో పడ్డారుఉ. మినుము చెట్టు ఏపుగా పెరుగుతున్నా పూత, పిందె రాలేదు. నకిలీ విత్తనాలు సాగు చేసి మోసపోయామని రైతులు గ్రహించారు. రైతులందరూ కలిసి రుద్రవరం మండలం వ్యవసాయ అధికారి శ్రీకృష్ణను కలిశారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఓ వ్యాపారస్తుడి వద్ద మినుము విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసి మోసపోయామని, తమకు తగిన న్యాయం చేయాలని వ్యవసాయ అధికారిని రైతులు కోరారు. స్పందించిన వ్యవసాయ అధికారి రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు వ్యవసాయ శాస్త్రవేత్తలకు సమాచారం అందించారు. వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నంద్యాల నుండి శాస్త్రవేత్తలు బుధవారం యర్రగుడిదిన్నె గ్రామానికి చేరుకొని రైతులు సాగుచేసిన మినుము పంటను పరిశీలించారు. రైతులు సాగు చేసిన మినుము విత్తనాలు పియు-31 రకం కాదని తేల్చి చెప్పడంతో రైతులు విస్తు పోయారు. అనంతరం మినుము విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేసింది, ఎన్ని రోజుల క్రితం సాగు చేశారు తదితర అంశాల వివరాలపై రైతులతో ఆరా తీశారు. రెండు రోజులలో సమగ్ర నివేదికలను పంపుతామని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ జయలక్ష్మి, సీనియర్ సైంటిస్ట్‌లు మంజునాథ్, ప్రభాకర్, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం



మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్‌లో ఆహా క్యాంటీన్ల కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో స్వయంసహాయ గ్రూపుల ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్ల ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో గురువారం స్థలాలను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని మహిళా పొదుపు గ్రూపు సభ్యులకు స్థిరమైన జీవనోపాధి ప్రోత్సహించడంలో భాగంగా ఏపి ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నవడ్డీ, వైఎస్ఆర్ చేయూత పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. పట్టణాలలో అనేక మంది మహిళా పొదుపు సభ్యులు ఆహార ఉత్పత్తుల రంగాల్లో ఆధారపడి జీవిస్తున్నారని, దీనిలో భాగంగా ఆహార ఉత్పత్తులు తయారు చేసే పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించడానికి, పట్టణాలలో టౌన్‌లెవెల్ ఫెడరేషన్ (టిఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఆసుపత్రులు, బస్సు స్టాండులు, రైల్వే స్టేషన్ వంటి ప్రముఖ ప్రదేశాలలో ఆహా...క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని తెలిపారు. ఆహా కాంటీన్‌ల ద్వారా సరసమైన ధరలకు నాణ్యమైన ఆహార ప్యాకెట్లను అవసరమైన వారికి సరఫరా చేస్తామన్నారు. నాణ్యమై అల్యూమినియ బాక్సులలో పులిహోర, చిత్రన్నం, పెరుగన్నం, వంగీబాత్ రూ.40కే సరఫరా చేయాలన్నారు. అందులో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, ఎస్‌జిహెచ్ గ్రూపులు కలిసి ఆహా కాంటీన్ స్థలాన్ని పరిశీలించారు.

నిరాడంబరతకు మారుపేరు టంగుటూరి ప్రకాశం

- జయంతి కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశ స్వాతంత్ర్యం కోసం తుపాకీకి ఎదురుగా వెళ్లి తన గుండెను చూపించిన ధీరుడు టంగుటూరు ప్రకాశం పంతులని, ఆయన సర్వ త్యాగనిరతిని, దేశభక్తిని, నిరాడంబరతను, ప్రజా సంక్షేమ దృష్టిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయుని పాలెం గ్రామంలో జన్మించారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించారని చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీకి ఎదురుగా వెళ్లి తన గుండెను చూపించిన ధీరుడని, తద్వారా ఆంధ్ర కేసరి అనే బిరుదును పొందారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సంతోష్, ఎఆర్ డిఎస్పీ రంగముని ఆర్‌ఐ సురేకర్, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ నిజాముద్దీన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **డోన్ :** పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్ఎం పద్మావతమ్మ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమం లో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, వెంకటలక్ష్మి, బాబు, అనంత శ్రీనివాసులు, రాధ, అల్లిపీర, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు,జయ సుబ్బరాయుడు, శివన్న, సురేష్, ఆదినారాయణ, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి, భారతిలక్ష్మి, ప్రభావతి, హుస్సేన్ భాను, మునిరాజు, ప్రసాదరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా జరిగాయి. ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఎంఇఓ శోభ వివేకవతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలిసి ప్రకాశం పంతులు, గిడుగు వెంకట రామమూర్తి చిత్ర పటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటలక్ష్మి మల్లేశ్వరమ్మ, లక్ష్మీదేవి, నాగేశ్వరమ్మ, స్వర్ణలత, లీలావతి, సుమ, గాయత్రి, లక్ష్మి శంకరమ్మ పాల్గొన్నారు.



నంద్యాలలో నివాళ్లు అర్పిస్తున్న ఎస్‌పి



డోన్ : నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆళ్లగడ్డ : పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆర్థికసాయం అందజేస్తున్న చైర్మన్, ఎంపిపి, సిఐ తదితరులు

జెసిబి డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-డోన్

జెసిబి డ్రైవర్ గిరి (35) కుటుంబానికి డోన్ పట్టణంలో ఆటో, లారీ, ఇతర డ్రైవర్ల సేకరించిన రూ.1,60,00 ఆర్థిక సాయం నగదును బుధవారం అందజేశారు. ఆదేవిధంగా డ్రైవర్‌కు ఉన్న ఐదేళ్ల కుమార్తెను మోడల్‌లో చేర్పించి , ఉన్నాయి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ముందుకు వచ్చారు. ఆయన ఉదారత్వాన్ని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎంఐఎ క్రాంతికుమార్, సీనియర్ అడ్వకేట్ నాగభూషణం , డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా పూర్తి చేయాలి

- డ్వామా పీడీ రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల : ఉపాధి పనులలో కొలతలు, పూడికతీత వంటివి సక్రమంగా పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ ఆఫీసు నందు ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఎస్ఆర్పి నీలకంఠం, డిఆర్పీలు వారి నివేదికలను చదివి వినిపించారు. ఉపాధి పనులు 687 జరగగా అందులో రూ. 6 కోట్ల 88 లక్షలు, పిఆర్ పనులు 34, వీటికి రూ. 3 కోట్ల 16 లక్షలు, ఆర్డబ్ల్యూఎస్ పనులు ఒకటికి రూ. 42 లక్షలు ఖర్చు అయింది. మొత్తం పనులకు 10 కోట్ల 29 లక్షల రూపాయలు పనులు జరిగాయని తెలిపారు. హాజరై కూడా సంతకాలు సరిగా చేయకపోవడం వంటి వివరాలు లేని వారికి పేమెంట్ చేసినందుకు రూ.41,090 రికవరీ చేశారు. రిజిస్టర్ జాబ్ కార్డుల యందు వివరాలు సరిగా చేయని ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.8500 జరిమానా విధించార. కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీడీవో వెంగ న్న, అదనపు పీడీ సలీం భాష, ఏపీడి బాలాజీ నాయక్, ఈపిడి శ్రీవిద్య, ఏవో దస్తగిరి, సిడి సిఎల్ఆర్పి ఏసుదాసు, ఏపీవో శేషన్న, గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రావణమాసం సందర్భంగా శ్రీశైలం దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి లవన్న తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం రెండవ, నాల్గవ శుక్రవారం నాడు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కెసి కెనాల్‌లో ప్రమాదవశాత్తు ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : మండలంలోని సింగవరం బ్రిడ్జి వద్ద కెసి కెనాల్‌లో ఇద్దరు ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మల్లికార్జున తెలిపిన వివరాల మేరక... పార్నపల్లి గ్రామానికి చెందిన గోపీనాథ్ రెడ్డి (28), కరిమిద్దల గ్రామానికి చెందిన సతీష్ (20) బుధవారం వరిమడిలో నారు మోసేందుకు వెళ్లి మధ్యాహ్నం కాళ్లు చేతులు కడుక్కొని భోజనం చేయాలని సింగవరం బ్రిడ్జి వద్ద కెసి కెనాల్‌లో దిగారు. వీరిద్దరూ మండల కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ నందు పని చేసే వారిని తెలుస్తోంది. మొదట సతీష్ కాలుజారి పడడంతో రక్షించేందుకు గోపీనాథ్ రెడ్డి ప్రయత్నించి ఇద్దరు మృతి చెందారు. విషయం తెలిసిన ఎస్ఐ వెంటనే కెసి కెనాల్ అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహాన్ని తగ్గించి మతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటల తర్వాత మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- ఆర్.నారాయణ మూర్తి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం కాకుండా చూడాలని సినీ డైరెక్టర్, నటుడు ఆర్.నారాయణ మూర్తి పేర్కొన్నారు. తిరుమల నుండి హైదరాబాద్ వెళ్ళుతూ ఎన్‌హెచ్-40 మార్గమధ్యలో శిరివెళ్ల మెట్ట వద్ద ఆయన విలేకరులతో ముచ్చటించారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో ఆశతో కోచింగ్ సెంటర్ వాళ్లకు లక్షలు వెచ్చించి ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన భాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పల్లెలు పట్టణాలకు పట్టుకొమ్మలాంటివని, పల్లెలు పాడిపంటలతో, పచ్చని పైరులతో కళకళలాడినప్పుడే ఈ రాష్ట్రం దేశం ఉంటుందన్నారు. కార్మికులను, కర్షకులను, నిరుద్యోగ యువతను ప్రభుత్వాలు ఆదరించినప్పుడే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సామాజిక కోణంలో ఒక చిత్రం నిర్మించి, నటిస్తున్నట్లు ఆయన తెలిపారు.



అంబరాన్నింటిన 'చంద్రయాన్-3' సంబరాలు

ప్రజాశకి - నంద్యాల కలెక్టరేట్

చంద్రయాన్-3 విజయవంతం అయిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఛాంబర్‌లో సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జెసి ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఇఒ సుధాకర్ రెడ్డి తదితరులు మిఠాయిలు ఒకరికొరు తినిపించుకున్నారు. **రుద్రవరం :** చంద్రయాన్ 3 రాకెట్ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా రుద్రవరంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ బావి కాడి జబ్బార్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులతో కేక్ కట్ చేసి పంచారు. ఉపాధ్యాయులు హుస్సేన్, మాలిక్, శివ, కైరున్నా బేగం, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** చంద్రయాన్-3 విజయవంతంలో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బిసి గుర్రెడ్డి కాలనీలో చంద్రయాన్-3 విజయవంతం కావడంపై బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. **పాములపాడు :** చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు పాములపాడులో టపాకాయలు పేల్చి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద విద్యా విహార్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రహంతుల్లా, వైసిపి నాయకులు టిఎన్ఆర్ నాగరాజు జనార్దన్ గుప్త ఆర్ఎంపీ డాక్టర్ వాసు విజయ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. **నందికొట్కూరు టౌన్ :** స్థానిక బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ వివిఎస్ సత్యనారాయణ మాట్లాడారు. కళాశాల డైరెక్టర్స్ సూది రెడ్డి రమేష్ రెడ్డి, సరళ దేవి, ప్రిన్సిపల్ జాన్ ఎలీషా బాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. **నందికొట్కూరు :** భారతదేశ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలబెట్టిన శాస్త్ర వేత్తలందరికీ టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి ధన్యవాదాలు తెలియజేశారు. **అవుకు :** ఇస్రో శాస్త్రవేత్తలకు టిడిపి అవుకు మండల నాయకులు గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డిలు అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌కు స్వీట్లు ఇస్తున్న దృశ్యం



రుద్రవరంలో...



బనగానపల్లె : స్వీట్లు పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి



పాములపాడులో...

బండ్ల మెట్ట వేలం ద్వారా భారీ ఆదాయం

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని తమ్మరాజు పల్లి గ్రామంలో టిప్పర్ గేటు (బండ్ల మెట్ట)కు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో సుమారు 18 మంది పాల్గొన్నారు. డిఎల్‌పిఒ రామ్ బాబు, పంచాయతీ సెక్రటరీ రాజ శేఖర్, గ్రామ సర్పంచ్ బత్తుల విజయ గౌరి అధ్యక్షతన నిర్వహించిన వేలం పాటలు పోలీస్ బందోబస్తు మధ్య వేలం పాటలు జరిగాయి. గ్రామానికి చెందిన మండ్ల మధు రూ. 6 లక్షల 65 వేలకు పాడి దక్కించుకున్నాడు. ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు బత్తుల శేషారెడ్డి, జగిలి రామకృష్ణ, శేక్షావలి, బాలరాజు, కోడె శేషయ్య, విద్యా కమిటీ ఛైర్మెన్ మధు సుదన్ నాయుడు పాల్గొన్నారు.

సిఐటియు నాయకుల అక్రమ అరెస్టు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కె.భాస్కర్ రెడ్డితో పాటు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పరమేష్, చాంద్ బాషా, విజయ్‌లు వెళ్లకుండా బుధవారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో సిఐటియు నాయకలు కె.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మునిసిపాలిటీలలోని పర్మినెంట్, ఇంజనీరింగ్, పారిశుధ్య, క్లాప్ డ్రైవర్స్, వివిధ విభాగాలలో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపడితే అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులు రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాట మరిచారని, నేడు అవే సమస్యలను పరిష్కరించాలని కోరితే అరెస్టులు ఎక్కడికక్కడ చేయడం దుర్మార్గమని అన్నారు. అరెస్టులను ఖండిస్తున్నామన్నారు, నిజంగా మున్సిపల్ కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వారు ఎదుర్కొంటున్న సమస్యలను, పడుతున్న బాధలను అర్థం చేసుకొని సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. లేకుంటే రాబోయే కాలంలో నిరవధిక సమ్మెకైనా మున్సిపల్ కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాల పరిశుభ్రతకు నిత్యం పాటుపడుతున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 18 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు రామ్ నాయక్, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు నాగన్నలు డిమాండ్ చేశారు. తబుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం దగ్గర పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ తధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో గోపికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, మండల అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినా వేతనాలు అప్పుడు ఇప్పుడు ఇస్తామని చెప్తున్నారె తప్ప నేటికీ కార్మికుల అకౌంట్లో పడలేదన్నారు. వేతనాలు ఇవ్వాలని అడిగితే పనులు చాలించుకోండి వేరే వాళ్లను పెట్టుకుంటామని అధికారులు బెదిరింపులు చేస్తున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం రూ.10వేలు జీతం ఇస్తామంటూ జీవో 680 వచ్చినా నేటికీ అమలు లేదన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అక్రమ వేధింపులు, తొలగింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, డిపిఒ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మికులు సుధాకర్, శివలింగం, స్వాములు, రవి, సోల్మాన్, దేవన్న, బాలన్న, ప్రభాకర్, మునిస్వామి, సుబ్బరాయుడు, రైతు సంఘం నాయకులు రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణ అభివృద్ధికి పెద్ద పీట వేసి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆధునీకరించిన మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌ను చైర్మన్ షేక్ మాబున్నిసాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గం అభివృద్ధికి పెద్దపీట వేశామని, సంక్షేమమే కాక అభివృద్ధి చేసి చూపెట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



చైర్మన్ నూతన ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

9 గంటల కరెంటు ఇవ్వాలని రాస్తారోకో

ప్రజాశక్తి - పాములపాడు

వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు 9 గంటల పాటు ఇవ్వాలని పాములపాడు మండలంలోని చెలిమిల్ల, లింగాల, పాములపాడు రైతులు ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యకం చేశార. 9 గంటల కరెంటు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఏడిఏ వసంతయ్య అక్కడికి వచ్చి రైతులకు కరెంటు ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు సామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, లింగాల రైతులు నవీన్, బాల మహేశ్వర్ రెడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతిలో పత్తి సాగు చేపట్టాలి

ప్రజాశకి - మిడుతూరు

నూతన పద్ధతిలో పత్తి సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారి పీర్ నాయక్ తెలిపారు. బుధవారం మిడుతూరులోని రైతు భరోసా కేంద్రాలలో రైతలుకు పత్తి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ మొదటి 60 రోజుల్లో చేప్పట్టాల్సిన ఎరువుల యాజమాన్యంపై వివరించారు. నందికొట్కూరు ఎడిఎ విజయ్ శేఖర్ మాట్లాడుఊ కేవీకే సేవలను అందిపుచ్చుకొని అధిక ఆదాయం పొందాలని సూచించారు. అనంతరం పశుగ్రాస విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, పిరమోన్ ట్రాప్స్ రైతులకు అందచేశారు. ఏరువాక కేంద్రం సైంటిస్ట్ రామకృష్ణ రావు, కేవీకే శాస్త్రవేత్తలు క్రిష్ణమూర్తి, రవిగౌడ్, విఎఎ దేవకుమార్, రైతులు పాల్గొన్నారు.

దూర విద్య చక్కటి అవకాశం : ఎంఇఒలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఆర్థిక స్తోమత లేకపోవడం, కుటుంబ కారణాల రీత్యా చదువు ఆపివేసిన విద్యార్థులకు దూరవిద్య ద్వారా చక్కటి అవకాశం వచ్చిందని ఎంఈఓలు రాజయ్య(1), అబ్దుల్ కలాం(2) బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ దూరవిద్య ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్స్ చదువుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 30వ తేదీలోప దరఖాస్తు చేసుకోవాలని, గ్రామాల్లోనే వాలంటరీల వద్ద 150 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు - రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మల్లెవేముల గ్రామ సమీపంలో పొలంలోకి వెలుతున్న ట్రాక్టరును వెనుక వైపు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రైతు అజిమొద్దీన్ తీవ్రంగా గాయపడ్డార. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు అజీమొద్దీన్ బుధవారం ట్రాక్టరుపై పొలానికి బయల్దేరారు. స్థానిక ఎస్ఎస్‌ట్యాంకు సమీపానికి చేరుకోగానే పొలంలోకి ట్రాక్టరు దిగుతుండగా అదే మార్గంలో పొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డ వెలుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రైతును చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడప : ఎమ్మెల్యే



జడ్పిటిసి పుల్యాల దివ్యకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగులను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. బుధవారం పగిడ్యాల గ్రామంలోని సచివాలయం-1, 2 పరిధిలో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బరక వీధిలో సిసి రోడ్డు వేయించాలని, విద్యుత్ తీగలు కిందికి ప్రమాదకరంగా మారాయిని, మరమ్మత్తులు చేయించాలని బరక వీధి ప్రజలు కోరారు. అనంతరం ఎమ్మెల్యే బీరవోలు బ్రిడ్జి సమీపాన ఉన్న భీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. బీరువోలు ప్రజలు గ్రామంలో సిసి రోడ్లు మంజూరయినా ఇంతవరకు వేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కుంట వీధి శివాలయం సందులో సీసీ రోడ్లు వేయించాలని ప్రజలు కోరారు. సిసి రోడ్లు వేయించేందుకు చర్యలు చేపట్టాలని పిఆర్ వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే ఆదేశించారు. కేసీ కెనాల్‌కు ఎన్ని రోజులు వరకు నీరు విడుదల చేస్తారని వనుములపాడు కృష్ణ మరి కొంతమంది రైతులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. నీరు ఉన్నన్నాళ్ళు వస్తాయని, నీరు లేనప్పుడు ఎవరేం చేయగలరని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా జడ్పిటిసి పుల్యాల దివ్య నివాసానికి వెళ్లి పథకాల గురించి వివరించారు. పంట బీమా, సున్నా వడ్డీ, ఆసరా పథకాల కింద రూ.27,189 మంజూరు అయ్యావని జెడ్పిటిసికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్‌డి నాగేంద్రయ్య, ఏఓ జ్యోతి కుమార్, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో మద్దిలేటి, సీఐ విజయ్ భాస్కర్, ఎస్సై నాగార్జున, ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమ్మ, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ శివకుమార్, డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్, విద్యుత్ శాఖ ఏఈ క్రాంతి కుమార్, కేసీ కెనాల్ ఏఈ నరేష్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సగినేల రమణ, నాయకులు చిట్టి రెడ్డి, విక్టరీ, జయరాం రెడ్డి, సాయి విజయ్, నాథ్ రెడ్డి, భూషి గౌడు, మసీదుల సుభాన్, రాజు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మహానంది :** ప్రజా సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో రెండవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా వైసీపీ నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వైద్య అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ నాగభూపాల్ రెడ్డి, తాహసిల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, ఎఒ నాగేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, జెడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ స్వరూప, వైసిపి నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మున్సిపాలిటిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 1వ సచివాలయం పరిధిలోని వీవర్స్ కాలనీ, నంద్యాల రోడ్డులో ఉన్న శిల్పకళా మందిరాల వద్ద గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆళ్లగడ్డ టౌన్ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ రమేష్ గౌడ్, కౌన్సిలర్లు బాలబ్బీ, గురుమూర్తి, బద్రి నీలకంఠేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైయస్సార్ నగర్‌లో 139వ రోజు బుధవారం వార్డు ఇంచార్జ్ టీవీ రమణ కౌన్సిలర్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మబ్బున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు వైసిపి నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు శెట్టి, తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ భాష, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఆచారి, రాము, ఉమా కాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.